క్లుప్తంగా

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు



ఆక్రమణకు గురైన స్థలాన్ని చదును చేసి పెట్టిన బోర్డు

నరసన్నపేట: స్థానిక డంపింగ్ యార్డుకు వెళ్లే మార్గంలో సిమెంట్ రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు కొందరు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు శనివారం అడ్డుకున్నారు. ఇది ప్రభుత్వం స్థలమని బోర్డు పెట్టారు. సత్యవరం రెవెన్యూ పరిధిలో 427/2–బీ సర్వే నంబర్‌లో ఒకవైపు జాతీయ రహదారి, మరోవైపు డంపింగ్ యార్డుకు వెళ్లే కాంక్రీట్ రోడ్డు ఉంది. అక్కడ 11 సెంట్లు వరకు ప్రభుత్వ భూమి ఉంది. విలువైన ఈ భూమిని ఇప్పటికే కొందరు తప్పుడు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు సమాచారం. లక్షల విలువ చేసే ఈ స్థలాన్ని ఆక్రమణదారులు జేసీబీతో చదును చేశారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న రెవెన్యూ ఆర్‌ఐ సాయిరాం, రెవెన్యూ సిబ్బంది రికార్డులు పరిశీలించి ఈ స్థలం ప్రభుత్వ భూమిగా నిర్ధారించి బోర్డు పెట్టారు. ఈ స్థలంలో ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



రహదారిని జేసీబీ బాగు చేయిస్తున్న కళింగనగర్ వాసులు

ఆమదాలవలస: మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆమదాలవలస మున్సిపాలిటీ 18వ వార్డు పరిధిలోని కళింగనగర్ వాసులు అధికారులు, పాలకులను కోరుతున్నారు. కాలనీలోని ప్రధాన రహదారి అధ్వానంగా తయారై రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. అధికారులకు పలుసార్లు విన్నవించినా.. స్పందించకపోవడంతో స్థానికులే స్వయంగా చందాలు వేసుకుని శనివారం కొంతమేర మట్టి రహదారిని నిర్మించారు. జేసీబీతో రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతీ సంవత్సరం మున్సిపాలిటీకి అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నా.. తమ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోడం లేదన్నారు. కాలనీలో పారిశుద్ధ్యం, రోడ్లు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలపై పురపాలక అధికారులు దృష్టి పెట్టాలని కోరారు.

నాట్య పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థినులు

హిరమండలం: అఖిల భారత నాట్య పోటీల్లో హిరమండలం విద్యార్థినులు ప్రతిభ చూపారు. విశాఖపట్నంలోని కళాభారతి ఆడిటోరియంలో జరిగిన నాట్య పోటీల్లో బెహరా సాయిశ్రీ, లాడె ధర్మిత, జి.గీతికా కుషిమిత బృంద నాట్యంలో ప్రతిభ చూపి ద్వితీయ స్థానంలో నిలిచారని హిరమండలానికి చెందిన నాట్య గురువు భార్గవి శనివారం తెలిపారు. పలువురు విద్యార్థినులు వివిధ కేటగిరిల్లో విజేతలుగా నిలిచారు. విశాఖ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

పశుగ్రాసాన్ని సాగుచేయాలి



పశుగ్రాసం సాగును పరిశీలిస్తున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: మండలంలోని పెద్దలొగిడి గ్రామంలో పాడి రైతులు సాగుచేస్తున్న పశుగ్రాసాన్ని పశువైద్యశాఖ ఏడీ డాక్టర్ ఎం.కరుణాకరరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ వరి సాగు తరువాత భూములను ఖాళీగా ఉంచకుండా 32 రకాల విత్తనాలతో పశుగ్రాసాన్ని సాగు చేయాలన్నారు. పచ్చ గడ్డి పశువుల మేతకు ఉపయోగపడుతుందన్నారు.

తరలిరండి..

పొందూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లుతోపాటు పెన్షన్ వ్యాలిడేషన్ సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. శనివారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రోణంకి రామచంద్రరావు, అంకం ధర్మారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరసన కార్యక్రమంలో పెన్షనర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం 8వ పే కమిషన్‌ను వెంటనే నియమించాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేయాలని, కమ్యూనికేషన్ రికవరీ కాలాన్ని 11 సంవత్సరాలుగా అమలు చేయాలని, మిగిలిపోయిన డీఏ ఇన్‌స్టాల్మెంట్లను కేంద్ర ప్రభుత్వం తరహాలో 55 శాతం విడుదల చేయాలని కోరారు.



పొలాన్ని దున్నుతున్న రైతులు

వ్యవసాయం ఏది బాబూ..?

- కూటమి ప్రభుత్వంలో రైతన్నకు దక్కని సాయం
- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని.. ఇప్పుడు పట్టించుకోని వైనం
- చిల్లిగవ్వలేక అన్నదాతల పాట్లు
- గతంలో రైతు భరోసా అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

పాతపట్నం: కూటమి నేతల మాటలకు, చేతలకు పొంతన ఉండడం లేదు. ఖరీఫ్ సాగు మొదలుకాక ముందే ఏడాది క్రితం వరకు ఐదేళ్లపాటు పంటల సాగుకోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయడంతో వ్యవసాయం పండగలా సాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటివరకు కనీస సాయం చేయకపోవడంతో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. అధికారం కోసం అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయలేడం లేదు.

పేరు మార్పుతోనే సరి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతలను ఆదుకునేందుకు రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 ఆర్థిక సాయం అందేది. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నదాత సుఖీభవగా పేరు మార్చి.. రూ.20 వేలు అందజేస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా పథకం అమలు ఊసేలేదు.

అదిగో, ఇదిగో అంటూ కాలయాపన

అన్నదాత సుఖీభవ పథకం అమలులో ఈ ప్రభుత్వానికి స్పష్టత కొరవడింది. ఏడాది నుంచి ఇస్తామని చెబుతున్నా.. నేటికీ విధి, విధానాలు వెల్లడించకపోవడం చూస్తే.. పాలకుల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోంది. ఏడాది జూన్ నెల 20న అని, 21వ తేదీ అని, జూలై ఆఖరు అని సీఎం చంద్రబాబు పలుసార్లు ప్రకటనలు చేశారు. జూలై 11వ తేదీ గడిచినా రైతు ఖాతాలో పథకం సొమ్ము జమ కాలేదు. ఇంతకీ అమలు చేసే ఉద్దేశం ఉందా, లేదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. గతేడాది దిగుబడులకు మద్దతు ధర లభించకపోవడంతోపాటు అంతంత మాత్రంగానే పంటలు రావడంతో అన్నదాతల చేతిలో చిల్లిగవ్వలేక ఖరీఫ్ సాగుకు అప్పులు చేయాల్సి వచ్చింది.

కౌలు రైతులకు దక్కని భరోసా..

కౌలుకు భూములను సాగుచేస్తున్న వారికి కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించింది. నేడు అవేవి పూర్తి స్థాయిలో అమలు చేయకుండా రద్దు చేయడంతో కౌలు రైతులు పథకానికి దూరమై గగ్గోలు పెడుతున్నారు.

నాడు రైతు భరోసా ఇలా...

ఏడాది క్రితం వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు భూసార పరీక్షల నుంచి దిగుబడులను మద్దతు ధరతో కొనుగోలు చేయడం వరకు అండగా నిలిచింది. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు గత ప్రభుత్వం పరిహారం అందజేసింది. ఖరీఫ్ ప్రారంభానికి ముందే రైతు భరోసా పథకం కింద ఏడాదికి రూ.13,500 నగదు సాయం రైతుల ఖాతాల్లో జమ చేసింది.

అన్నదాతలకు అండగా..

పాతపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా అమలు చేసి అన్నదాతలను ఆదుకున్నారు. పాతపట్నం మండలంలోని 9,183 మంది, కొత్తూరులోని 10,961 మంది, మెళియాపుట్టిలోని 9,597 మంది, హిరమండలంలోని 5,648 మంది, ఎల్.ఎన్.పేటలోని 5,890 మంది రైతులకు ఏటా రూ.13,500 చొప్పున వారి ఖాతాల్లో నగదు జమైంది.

ఒక్క పైసా అందలేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా రైతులకు ఒక పైసా జమ చేయలేదు. గత ప్రభుత్వంలో ప్రతి ఏటా రైతు భరోసా పథకం వచ్చింది. విత్తనాలు, ఎరువులు, రైతు భరోసా కేంద్రాల్లోనే అందుబాటులో ఉండేవి. ఎరువుల కోసం పెట్టే ప్రయాణ ఖర్చులు మిగిలేవి. ఇప్పుడు ఆ ఊసే లేదు.

– మద్ది నారాయణరావు, రైతు, పెద్దసీది, పాతపట్నం మండలం

గత ప్రభుత్వంలో రైతులకు పండగ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా ప్రతి రైతుకూ వచ్చేది. పంట సాగుకు ముందే భరోసా నగదు ఖాతాల్లో పడడంతో ఎరువులు, విత్తనాల కొనుగోలుకు అప్పులు చేయాల్సిన అవసరం ఉండేదికాదు. నేడు విత్తన సౌకర్యం లేకుండా దళారుల వద్ద కొనుగోలు చేసి మోసపోతున్నాం.

– సురవరపు రామారావు, రైతు, ఆర్.ఎల్.పురం, పాతపట్నం మండలం

హామీలు విస్మరించారు..



రైతుల ఓట్ల కోసం రైతు భరోసాను అన్నదాత సుఖీభవగా పేరు పెట్టి ఇచ్చిన మాటను కూటమి నాయకులు విస్మరించారు. పంట సాగు రుణాల కోసం బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్స్‌ల వద్దకు వెళ్లి అధిక వడ్డీలకు రుణాలు తెచ్చుకుంటున్నాం. రైతులకు హామీ ఇచ్చి ఏడాది కావస్తున్నా, కూటమి ప్రభుత్వం సుఖీభవ ఊసే ఎత్త లేదు. మా పరిస్థితి దారుణంగా మారింది.

– మజ్జి జోగారావు, రైతు, అచ్చుతాపురం, పాతపట్నం

రంధ్రం పూడ్చారు

సాక్షి ఎఫెక్ట్

సారవకోట: మండలంలోని వడ్డినవలస నుంచి జలుమూరు మండలంలోని కొమనాపల్లికి వెళ్లే రహదారిలో అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాల జంక్షన్లో కల్వర్టుకు ఏర్పడిన రంధ్రాన్ని పూడ్చారు. శనివారం సాక్షిలో అటెన్షన్ ప్లీజ్ అనే శీర్షిక వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సంబంధిత అధికారులు రంధ్రాన్ని సిమెంట్‌తో పూడ్చివేయించారు.



సిమెంట్‌తో రంధ్రాన్ని పూడ్చిన దృశ్యం

పరామర్శ..

జలుమూరు: సారవకోట మండలంలోని బుడితి సీహెచ్‌సీలో వైద్యం వికటించి ఇటీవల మృతి చెందిన ఇద్దరు బాలింతల కుటుంబాలను వైఎస్సార్ సీపీ యువ నాయకుడు, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య శనివారం పరామర్శించారు. జలుమూరు మండలంలో గల పాగోడు, యలమంచిలి గ్రామాలకు చెందిన బాలింతలు కొర్లాపు ధనలక్ష్మి, పట్ట అరుణ కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. కరవంజలో ఇటీవల మృతి చెందిన చల్ల సుగుణ, చింతు రాజప్పడు కుటుంబాలను ఓదార్చారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, ధర్మాన జగన్, సర్పంచ్‌లు దామ మన్మథరావు, మెండ రవికుమార్, జుత్తు నేతాజీ, ఎంపీటీసీ సభ్యుడు రావాడ చందనబాబు, నరసన్నపేట మండలం యువజన విభాగం అధ్యక్షుడు బుద్దల రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

నరసన్నపేట మండలంలో..

నరసన్నపేట: మండలంలోని వైఎస్సార్‌సీపీకి చెందిన సానుభూతిపరులు, కార్యకర్తల కుటుంబాలను పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య శనివారం పరామర్శించారు. బొరిగివలసకు చెందిన రాజాపు గురన్న ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, బొంతల వీధికి చెందిన చెంచులమ్మ మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గోపాలపెంటలో అనారోగ్యంతో బాధపడుతున్న తోట రమేష్‌ను పరామర్శించి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీపీ ఆరంగి మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, గుప్త, అప్పన్న, నర్సింగరావు, బి.రాజశేఖర్, తదితరులు ఉన్నారు.



జలుమూరు: పాగోడులో ధనలక్ష్మి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

తల్లికి వందనం పేరుతో వంచన

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: తల్లికి వందనం పథకం పేరుతో కూటమి ప్రభుత్వం ఎంతో మంది తల్లులను మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తల్లికి వందనం పథకం తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టి, రెండో ఏడాది అమలు చేసినా.. అడ్డగోలు నిబంధనలతో లబ్ధిదారులను తగ్గించిందన్నారు.

ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌తోపాటు వందల సంఖ్యలో హామీలు ఇచ్చి వాటిని ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ఏడాది కాలంగా రాష్ట్రంలో అరాచక పరిపాలన సాగుతోందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలనే చిత్తశుద్ధి కూటమి ప్రభుత్వానికి లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి పథకాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా క్రమం తప్పకుండా అమలు చేశారన్నారు. తల్లికి వందనం పథకానికి ఎటువంటి కొర్రీలు లేకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారునికీ వర్తింపజేయాలని కూటమి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాపక్షాన నిలబడి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు.

అధికమైతే అనర్థమే..



రసాయన ఎరువు వేస్తున్న రైతు (ఫైల్)

- రసాయన ఎరువులు మితిమీరవద్దు
- శాస్త్రవేత్తల సూచనల మేరకే ఎరువులు వేయాలి
- యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు

సరుబుజ్జిలి: వరుణుడి కరుణతో ఖరీఫ్ సాగులో రైతులు నిమగ్నమయ్యారు. ఖరీఫ్ సీజన్లో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే చీడపీడలను అధిగమించవచ్చు. వ్యసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు అన్నదాతలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో 24,367 హెక్టార్లలో ఖరీఫ్ సీజన్‌లో పంటలను సాగు చేస్తున్నారు.

పరిమితికి మించవద్దు...

భూసారం మేరకే రసాయన ఎరువులు, పురుగు మందులు వాడాలి. మట్టి సమూనాలను అనుసరించి నత్రజని, భాస్వరం, పోటాష్, జింకు ఎరువులను సమతుల్యంగా వినియోగించాలి. అవసరం ఉన్న కంటే ఎరువులు, పురుగు మందులు అధికంగా వినియోగిస్తే మొక్కకు మెత్తబడి తెగుళ్ల ఆశిస్తాయి. అధికంగా ఎరువులు, పురుగు మందులు వాడడం వలన భూసారం నశించి పంటల దిగుబడి తగ్గుతుంది.

యూరియా రూపంలో నత్రజని...

నత్రజనిని యూరియా రూపంలో రైతులు వాడుకోచ్చు. నత్రజని పంటల ఎదుగుదలకు, పచ్చదనానికి ఉపయోగపడుతుంది. మూడు భాగాలుగా విభజించి వాడాలి. మొదటి భాగం దమ్ము చేసే ముందు వేయాలి. రెండో భాగం పిలకలు వేసే దశలో, మూడో భాగం పొట్ట (అంకురం) ఏర్పడే సమయంలో వేయాల్సి ఉంటుంది. వెద జల్లే పద్ధతిలో బురద పనుల్లో మాత్రమే 36 నుంచి 48 గంటల తరువాత కొద్దిపాటి నీరు పెట్టాలి. అదేవిధంగా 50 కిలోల యూరియాకు 10 కిలోల వేప పిండి, 250 కిలోల తేమ కలిగిన మట్టిని కలిపి రెండు రోజులు నిల్వ ఉంచి పొలంలో వాడితే నత్రజని ప్రభావం పెరుగుతుంది.

దుబ్బు కట్టేందుకు భాస్వరం..

భాస్వరం మొక్కల వేర్లు దృఢపడటానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అందువలన ఈ ఎరువును పూర్తిగా దమ్ము సమయంలో వేయాలి. లేదా ఉభాలు వేసిన పది రోజుల లోపు వేయాల్సి ఉంటుంది. ఎకరాకు 50 కేజీల వరకు వాడుకోవచ్చు.

పిండి పదార్థం తయారీకి....

పొటాష్ వాడటం వలన ఆకులు గరుకు కలిగి ఉంటాయి. దీనివలన పైరుకు చీడ, పీడల బెడద తప్పుతుంది. అంతేకాకుండా పిండి పదార్థం తయారీకి ఎంతగానో సహకరిస్తుంది. అందువలన పొటాష్ నాట్లు వేసిన 10 రోజుల్లో 15 కేజీలు, చిరు పొట్ట దశలో మరో 15 కేజీలు వేయాల్సి ఉంటుంది.

అధికారుల సూచనలు పాటించాలి



అధికారుల సూచనల మేరకు ఎరువులు, పురుగు మందుల వాడకం మంచిది. సరైన సమయంలో తగిన మోతాదు మేరకు వాడకం చేపడితే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. క్షేత్రస్థాయిలో రైతులకు గ్రామీణ వ్యవసాయ సహాయకులతో నిరంతర సూచనలు అందించేలా చర్యలు చేపట్టాం.

– పి.మన్మథరావు, మండల వ్యవసాయాధికారి, సరుబుజ్జిలి

ఆమదాలవలస నియోజకవర్గంలో ఖరీఫ్ పంటల సాగు (హెక్టార్లు) వివరాలు				
మండలం	సరుబుజ్జిలి	బూర్జ	పొందూరు	ఆమదాలవలస
ఖరీఫ్‌సాగు	5,201	6,109	6,823	6,234

బలద ఇసుక ర్యాంపులో..

అక్రమ తవ్వకాలు



బలద ఇసుక ర్యాంపు వద్ద పొక్లెయినర్లతో రెండు మీటర్లు కంటే ఎక్కువ లోతులో తవ్విన ఇసుక గుంతలు

కొత్తూరు: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక ఇసుక పాలసీ టీడీపీ నేతలకు కాసులు కురుపిస్తోంది. కొత్తూరు మండలంలోని బలద రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న వంశధార నది పరిధిలో 6.34 హెక్టార్‌లలో 63,442 క్యూబిక్ మీటర్ల డీ షిల్టు తొలగింపునకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. అనుమతుల ప్రకారం నదిలో వేసిన ఇసుక మేట్లలో ఇసుక పొరను మనుషుల ద్వారా తొలగించాలి. ఆ ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ర్యాంపునకు సమీపంలో ఏర్పాటు చేసిన నిల్వ పాయింట్ వద్దకు తీసుకురావాలి. కానీ బలద ర్యాంపు వద్ద అందుకు భిన్నంగా జరుగుతోంది. పొక్లెయినర్లతో రాత్రిళ్లు ట్రాక్టర్లకు ఇసుక లోడ్ చేసి స్టాక్ పాయింట్‌కు తరలిస్తున్నారు. అక్కడ ప్రభుత్వ ధరల కంటే అధికంగా విక్రయిస్తున్నారు. నదిలో సుమారు రెండు మీటర్ల లోతులో ఇసుక తవ్వడంతో పాటు ఆ ప్రాంతానికి వరద నీరు రాకుండా గట్లు కూడా ఏర్పాటు చేసి ఏకంగా ప్రవాహాన్నే మార్చేస్తున్నారు. వరద వస్తే నీరు ఊరిలోకి చొరబడే ప్రమాదముంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వసపలో విక్రయానికి నిల్వ చేసిన ఇసుక



బలద ర్యాంపు వద్ద నది నీరు ఇసుక తవ్వకాల్లోకి రాకుండ గట్టు వేస్తున్న వైనం

హత్యా రాజకీయాలు సరికాదు

కొత్తూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గతంలో ఎప్పుడూ లేనివిధంగా జిల్లాలో హత్యా రాజకీయాలు పెరిగాయని వైఎస్సార్‌సీపీ కొత్తూరు మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ అన్నారు. కొత్తూరులో శనివారం విలేకర్లతో మాట్లాడారు. ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సత్తారు గోపిని కూటమి నేతలు హత్య చేయించడంపై తీవ్రంగా ఖండించారు. గోపిని హత్య చేసిన నిందితులందరినీ పట్టుకొని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇటువంటి హత్యలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. హత్యా రాజకీయాలతో ఎన్నాళ్లూ కూటమి నేతలు పాలన సాగించలేరన్నారు. కూటమి ప్రభుత్వానికి సరైన సమయంలో ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ యర్లంకి ధర్మారావు, రంజిత్ కుమార్, పాతపట్నం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు అగతమూడి నాగేశ్వరరావు, సవర రమేష్, బొమ్మాళి నగేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గండివలస ఆనందరావు

ఘనంగా నాబార్డ్ దినోత్సవం

బూర్జ: మండలంలోని పెద్దపేట ఆర్ట్స్ సంస్థ కార్యాలయంలో డైరెక్టర్ నూక సన్యాసిరావు ఆధ్వర్యంలో నాబార్డ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సన్యాసిరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధ కార్యకలాపాలను ప్రోత్సహించడానికి నాబార్డ్ అండగా ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటీర, చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు సహాయం అందిస్తుందన్నారు. నాబార్డ్ సహకారంతో ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో 1998 నుంచి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మహిళలకు శిక్షణ కార్యక్రమాలు, వాటర్ షెడ్ ద్వారా సహజ వనరుల అభివృద్ధి, మాతోట ద్వారా 1000 ఎకరాల్లో 1,030 మంది రైతులతో జీడి, ఉసిరి, అంతర పంటలు వేసి అదనపు ఆదాయం పొందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో రోడ్లు, భవనాల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. సంస్థ ఎఫ్‌పీఓ కోఆర్డినేటర్ నూక అనూప్, మన్యం సహజ సీఈఓ బి.శంకరరావు, ఆర్ట్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూక సన్యాసిరావు

ఇప్పగూడలో వైద్య శిబిరం

హిరమండలం: మండలంలోని కిట్టాలపాడు పంచాయతీ ఇప్పగూడ గిరిజన గ్రామంలో హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి ఫరూక్ హుస్సేన్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులు పలువురికి వైద్య తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల గూర్చి తెలియజేశారు. దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ వినీత్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

దరఖాస్తుల ఆహ్వానం

పొందూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ జూనియర్ లెక్చరర్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ టి.ఇందిర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ ఈఈఈ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తును జూనియర్ కళాశాలకు అందజేయాలన్నారు. ఈ నెల 18వ తేదీన శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం: ఈ నెల 13వ తేదీన పాతపట్నం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతులు, కొత్త విద్యుత్ లైన్ వేసే పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు టెక్కలి విద్యుత్‌శాఖ ఈఈ జి.శంకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బైరాగిపేట, దశరథపురం, కొత్తచంగుడి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.